
సాక్షి పశ్చిమగోదావరి

బుధవారం। 29। మే। 2024



మొగల్తూరు కోట వైభవం
గత వైభవానికి ప్రతీకగా ఉన్న మొగల్తూరు కోట చరిత్ర ఆనవాళ్లను చాటిచెబుతోంది. 2.5 హెక్టార్ల విస్తీర్ణంలోని కోటలో సంస్థాన వారసులు ఇప్పటికీ నివసిస్తున్నారు. 8లో ▸



పేదలకు గృహ'మస్తు'
సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదల సొంతింటి కల సాకారమైంది. పశ్చిమ గోదావరి జిల్లాలో ఇంతవరకు 27వేల మంది సొంతిళ్లు నిర్మించుకున్నారు. 8లో ▸



ఆక్వాను ఆదుకోవాలి
రొయ్యల రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని, మద్దతు ధరకు రొయ్యలు కొనాలని రొయ్యల రైతుల సంఘం నాయకులు పశ్చిమ కలెక్టర్‌ను కోరారు. 8లో ▸

న్యూస్‌రీల్

సమ్మర్ క్లాసులు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న కేంద్ర గ్రంథాలయ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు, విశ్రాంత ఉపాధ్యాయులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం గ్రేడ్‌-1 శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం సమ్మర్ క్లాసులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కేంద్ర గ్రంథాలయం(ఏలూరు) కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు పేర్కొన్నారు. పట్టణంలోని గ్రంథాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. శేఖర్ బాబు మాట్లాడుతూ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుంటే వారి భవిష్యత్తు బంగారం అవుతుందన్నారు. విజ్ఞానంతో పాటు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. విశ్రాంత అధ్యాపకుడు గరికపాటి బాపయ్య శర్మ, ప్రత్తి వీరాస్వామిలచే తొలుత పుస్తక పఠనం, ఇంగ్లీషు, తెలుగు పాఠ్యాంశాలు, ఎల్‌ఐసీ ఉద్యోగి రామాంజనేయులు ఆధ్యాత్మిక విషయాలను నేర్పించారు. యోగా మాస్టార్ పాండు యోగా శిక్షణ అందించారు. గ్రంథాలయాధికారి వి.శ్రీనివాస్‌రావు పర్యవేక్షించారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షకు 2,497 మంది హాజరు

భీమవరం: టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన గణిత పరీక్షకు 49.90 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 5,004 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 2,497 మంది హాజరయ్యారన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన కల్పించాలి

ఏలూరు (టూటౌన్): క్యాన్సర్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ శర్మిష్ఠ చెప్పారు. స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో క్యాన్సర్ శిక్షణా కార్యక్రమాన్ని డీఎం అండ్ హెచ్‌ఓ శర్మిష్ఠ, వైద్యకళాశాల ప్రధాన అధ్యాపకుడు డాక్టర్ భాస్కరరావుతో కలిసి మంగళవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా అవగాహన పెంచుకొని క్యాన్సర్ గురించి సమగ్రంగా తెలుసుకుని తెలుసుకున్న విషయాలను కింది స్థాయి వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఏఎన్ఎంలకు శిక్షణ ఇవ్వాలని కోరారు. ప్రజల్లో క్యాన్సర్ పట్ల అవగాహన కల్పించాలన్నారు. వైద్య కళాశాల ప్రధాన అధ్యాపకుడు భాస్కరరావు మాట్లాడుతూ కింది స్థాయి వైద్య సిబ్బంది ప్రజల్లో క్యాన్సర్ లక్షణాలు గుర్తించిన వెంటనే వారికి మెరుగైన వైద్య పరీక్షలు నిర్వహించి, తగిన వైద్యాన్ని అందించడానికి సహాయపడాలన్నారు.

మహిళలే నిర్ణేతలు

- జిల్లాలో 11,534 మహిళల ఓట్లు అధికంగా పోలింగ్
- సంక్షేమం, ప్రభుత్వ సానుకూలతతోనే పెరుగుదల
- బలం చేకూరుస్తున్న ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక
- వైఎస్సార్‌సీపీకి కలిసి వస్తుందంటున్న విశ్లేషకులు



నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	పురుషులు	మహిళలు
ఆచంట	1,80,017	1,49,048	73,024	76,022
పాలకొల్లు	1,95,057	1,60,489	79,802	80,684
నరసాపురం	1,70,448	1,43,825	72,598	71,227
భీమవరం	2,53,116	2,00,857	99,174	1,01,656
ఉండి	2,24,725	1,93,722	96,695	97,025
తణుకు	2,34,575	1,92,736	94,042	98,690
తాడేపల్లిగూడెం	2,14,985	1,75,990	87,208	88,773

సాక్షి, భీమవరం: సార్వత్రిక సమరంలో అధికశాతం పోలింగ్ ద్వారా మహిళలు నిర్ణయాత్మక శక్తిగా మారారు. పురుషుల కంటే 11,534 ఓట్లు అధికంగా మహిళల ఓట్లు పోలయ్యాయి. గత ఐదేళ్లలో అమలైన సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సానుకూలత ఈ పెరుగుదలకు కారణమని విశ్లేషకులు అభిప్రాయపడుతుండగా.. ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక ఇందుకు బలం చేకూరుస్తోంది. జిల్లాలో 14,72,923 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 7,21,532, మహిళలు 7,51,313, ఇతరులు 78 మంది ఉన్నారు. ఈ నెల 13న జరిగిన ఎన్నికల్లో 6,02,543 మంది పురుషులు 6,14,077 మంది మహిళలు, 47 మంది ఇతరులు కలిపి 12,16,667 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఆరు నియోజకవర్గాల్లో పురుషుల కన్నా మహిళలే అధికంగా ఓట్లు వేశారు. అత్యధికంగా తణుకులో 4648 మహిళా ఓట్లు పోలవగా, ఆచంటలో 2,998, భీమవరంలో 2,482, తాడేపల్లిగూడెంలో 1,565, పాలకొల్లులో 882, ఉండిలో 330 ఓట్లు పోలయ్యాయి. మహిళా ఓట్లు అధికంగా పోలవ్వడానికి ప్రభుత్వ సానుకూలతే కారణమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. మునుపెన్నడూలేని విధంగా గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలుచేసిన అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, ఆసరా, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, జగనన్న ఇళ్లు తదితర అన్ని సంక్షేమ పథకాలకు మహిళలనే లబ్ధిదారులను చేయడం, వారికి ఆర్థిక తోడ్పాటును అందించింది. కుటుంబంలో వారి ప్రాధాన్యతను మరింత పెంచింది. ఈ ఐదేళ్లలో పేదల జీవన ప్రమాణాలు ఎంతో మెరుగుపడ్డాయి. తమకు మేలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్న గట్టి పట్టుదలతో రాత్రి బాగా పొద్దుపోయినా మహిళలు క్యూలైన్లలో బారులు తీరి ఓట్లు వేశారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మహిళల ఓట్లు ప్రభుత్వానికి సానుకూలంగా ఉంటాయని భావిస్తున్న కూటమికి వారి పోలింగ్ శాతం పెరగడం విపక్ష అభ్యర్థులను ఆందోళనకు గురిచేస్తోందంటున్నారు. మహిళల పేరిట ప్రభుత్వం పథకాలు మంజూరు చేయడం వల్ల మహిళల ఓటింగ్ పెరిగిందని ఇటీవల విడుదల చేసిన నివేదికలో ఎస్‌బీఐ రీసెర్చ్ సంస్థ పేర్కొనడం విశ్లేషకుల అభిప్రాయానికి బలం చేకూరుస్తోంది. పెరిగిన మహిళ ఓట్లు వైఎస్సార్‌సీపీకి మేలు చేస్తాయని వారంటున్నారు. అధికారపార్టీ అభ్యర్థుల విజయంలో కీలకపాత్ర పోషిస్తాయని అభిప్రాయపడుతున్నారు.

చారిత్రాత్మక విజయం ఖాయం

నరసాపురం పార్లమెంట్‌లో వైఎస్సార్‌సీపీ చారిత్రాత్మక విజయం ఖాయమని పార్టీ కేడర్ ధీమా వ్యక్తం చేస్తుంది. తొలిసారి వైఎస్సార్‌సీపీ పార్టీ నుంచి బీసీ సామాజిక వర్గానికి చెందిన మహిళ న్యాయవాది గూడూరి ఉమాబాల పోటీలో నిలిచి చరిత్రకెక్కారు. సామాజికవర్గాలకు అతీతంగా ఆమెకు జిల్లా వ్యాప్తంగా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. తమ ఇంటి ఆడబిడ్డలా ఆదరించారు. మహిళల ఓటింగ్ పెరగడం ఉమాబాలకు కలిసొచ్చే అంశమని, ఆమె భారీ ఆధిక్యతను సాధిస్తారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

స్ట్రాంగ్ రూంల పరిశీలన



అభ్యర్థులతో కలిసి కౌంటింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

భీమవరం: ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ ద్వారా పోలైన ఓట్లు లెక్కింపు కోసం పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు, కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక విష్ణు కళాశాల ఆవరణలో కౌంటింగ్ కేంద్రాలు, టేబుల్స్ ఏర్పాటు, స్ట్రాంగ్ రూంలను పోటీలో ఉన్న అభ్యర్థులు, ఏజెంట్లతో కలిసి కలెక్టర్ పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ కౌంటింగ్ కోసం ముందస్తు ఏర్పాట్ల ప్రక్రియ పూర్తయినట్లు తెలిపారు. జూన్ 4 న కౌంటింగ్ కోసం చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అసెంబ్లీ, పార్లమెంటు సెగ్మెంట్‌లకు 14 చొప్పున, పరిశీలకులు, పోస్టల్, ఈటీపీబీఎస్‌ల కోసం టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కౌంటింగ్ పరిశీలకు ఒక టేబుల్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. పార్లమెంటు నియోజక అభ్యర్థులకు పోలైన ఓట్లను అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కేటాయించిన బ్లాక్‌లలో లెక్కించనున్నట్లు తెలిపారు. పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలో పోలైన పోస్టల్ బ్యాలెట్ ఓట్లను, ఈటిపిబిఎస్ ఓట్లను విష్ణు కళాశాల లైబ్రరీ హాల్లో లెక్కించనునట్లు తెలిపారు. ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాలను జాయింట్ కలెక్టర్ సి.వి ప్రవీణ్ ఆదిత్యతో కలిసి కలెక్టరు స్వయంగా పరిశీలించారు.

పారిజాతగిరిలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

నేడు శేష వాహన సేవ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరిలో బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. భక్తుల అభీష్టాలు తీర్చే స్వామిగా పూజలందుకుంటున్న శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాలకు విశిష్ట ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఆలయ ప్రధానార్చకుడు నల్లూరి రవికుమారాచార్యులు ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ఆలయంలో విశ్వక్సేన పూజ, అంకురార్పణ, వైనతేయ ప్రతిష్ఠ తదితర పూజలు నిర్వహించారు. ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరు కాగా, తీర్థప్రసాదగోష్టి, ప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ ఈవో మానికల రాంబాబు పర్యవేక్షించగా, ఆలయ కమిటీ, అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



పారిజాతగిరిలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నేటి కార్యక్రమాలు :
పారిజాతగిరిలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, ధ్వజారోహణం, అగ్నిప్రతిష్ఠ, కుంభస్థాపన, నిత్య హోమం జరుగుతాయి. సాయంత్రం స్వామికి శేష వాహన సేవ నిర్వహిస్తారు.

కౌంటింగ్‌కు రాజకీయ పార్టీలు సహకరించాలి

కలెక్టర్ సుమిత్‌కుమార్

భీమవరం: ఓట్ల లెక్కింపులో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోటీలో ఉన్న అభ్యర్థులు, ఏజెంట్లు పూర్తిగా సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ కోరారు. మంగళవారం ఆనంద్ ఇన్ సమావేశ మందిరంలో అభ్యర్థులు, ఏజెంట్లతో ఓట్ల లెక్కింపుపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సంఘం ఆదేశాలతో వచ్చేనెల 4న భీమవరం పట్టణంలోని విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో ఆచంట, పాలకొల్లు, నరసాపురం, తణుకు నియోజవర్గాలు, ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. ముందుగా 8 గంటలకు పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు జరుగుతుందన్నారు. అనంతరం 8.30 గంటల నుంచి 7 నియోజకవర్గాల కౌంటింగ్ హాళ్లలో ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని కలెక్టర్ వివరించారు. పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు విష్ణు కళాశాలలో మాత్రమే జరుగుతుందని స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలలో పోలైన ఓట్ల వివరాలను అభ్యర్థులు లేదా ఏజెంట్లకు ప్రతి టేబుల్ వద్ద చూపిస్తారని అభ్యంతరాలు ఉంటే వెంటనే చెప్పాలన్నారు. లెక్కింపు కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు ఎట్టి పరిస్థితులలో అనుమతించేది లేదని స్పష్టం చేశారు. ఎస్పీ వేజెండ్ల అజిత మాట్లాడుతూ పోటీలో ఉన్న అభ్యర్థులు తమ ప్రతినిధులు, అనుచరులు శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తించవద్దని ముందుగానే వీడియో సందేశం పంపాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సమన్వయ అధికారి చందన దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఓట్ల లెక్కింపు అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ఇంటర్ విద్యతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం

భీమవరం: ఇంటర్ పూర్తి కాగానే విద్యార్థులు ఉద్యోగులుగా మారే సదవకాశం, సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ బిట్స్ పిలానీ, శాస్త్ర, అమిటీ లాంటి ప్రసిద్ధ విశ్వవిద్యాలయాలలో ఉన్నత చదువు కొనసాగించే సదావకాశం విద్యార్థులకు ఉందని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కే.చంద్రశేఖర్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో విద్యార్థులకు ఈ మహత్తర అవకాశం లభిస్తుందని, రాష్ట్రంలో 75 శాతం మార్కులతో ఇంటర్ పూర్తి చేసిన అన్ని గ్రూపుల నాన్ మ్యాథ్స్ విద్యార్థులకు ఇంటర్మీడియట్ బోర్డు, హెచ్‌సీఎల్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 2022-23, 2023-24 విద్యా సంవత్సరాలలో ఇంటర్మీడియట్ విద్యను 75 శాతం మార్కులతో పూర్తి చేసిన విద్యార్థులు, ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇంటర్ చదువుతున్న విద్యార్థులు ఈ ఉద్యోగాలకు అర్హులన్నారు. ఈ ఉద్యోగాల కోసం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే సుమారు 500 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకొన్నారని, వీరికి ఇంటర్మీడియట్ బోర్డ్, హెచ్‌సీఎల్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 31న భీమవరంలోని ఆదిత్య జూనియర్ కళాశాలలో ఉదయం 9 నుంచి అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ప్రారంభిస్తారని తెలిపారు. ఈ ఎంపిక ప్రక్రియలో భాగంగా తొలుత క్యాట్ పరీక్ష, ఇంటర్వ్యూ, చివరిగా ఇంగ్లీష్ వెర్షన్ పరీక్షలు నిర్వహిస్తారు. ఈ మూడింటిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఏడాదిపాటు శిక్షణ ఇస్తారు. శిక్షణలో ఏడో నెల నుంచి నెలకు రూ.10 వేలు చొప్పున స్టైఫండ్ ఇస్తారు. బైపీసీ, సీఈసీ, హెచ్‌ఐసీ, ఒకేషనల్ గ్రూపులు చదివిన విద్యార్థులు డీపీఓ విభాగంలో ఉద్యోగం పొందవచ్చన్నారు. ఉన్నత విద్యను కొనసాగించే సదవకాశాన్ని కూడా కల్పించడానికి హెచ్‌సీఎల్ సంస్థ ప్రణాళిక రూపొందించింది. అమిటీ యూనివర్సిటీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఉన్నత విద్యకు హెచ్‌సీఎల్ ఆర్థిక సహాయం అందిస్తుందని, సందేహాలు ఉంటే సాయి కిరణ్‌ను 9642973350 నెంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు

ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్



భీమవరంలో కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐజీ అశోక్‌కుమార్

భీమవరం: ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని కౌంటింగ్ కేంద్రాల్లో ఎవరైనా ఘర్షణలకు పాల్పడినా రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసిన చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం భీమవరం పట్టణంలోని ఎస్ఆర్‌కేఆర్, విష్ణు ఇంజనీరింగ్ కళాశాలల వద్ద ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూంల వద్ద భద్రత, ఓట్ల లెక్కింపు కేంద్రాల ఏర్పాట్లను ఎస్పీ వేజెండ్ల అజితతో కలిసి పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రాలకు వచ్చే అధికారులు, సిబ్బందికి ఏర్పాటు చేసిన మార్గాలను, అభ్యర్థులు, ఏజెంట్లు వెళ్లడానికి వీలుగా ఏర్పాటు చేసిన మార్గాలు, కౌంటింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాల వెబ్ కాస్టింగ్‌ను పరిశీలించారు. నియోజకవర్గాల వారీగా కౌంటింగ్ కేంద్రాలలోకి వెళ్లే మార్గాల వద్ద దిక్సూచి బోర్డులను స్పష్టంగా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. గుర్తింపు కార్డులున్నవారిని మాత్రమే అనుమతించాలన్నారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ముందస్తు జాగ్రత్త చర్యల గురించి ఎస్పీ వివరించారు. హింసాత్మకమైన సంఘటనలకు పాల్పడితే సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా అటువంటి వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తామని ఐజీ హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, డీఎస్పీ వి.నారాయణస్వామి, ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ ఎం.సత్యనారాయణ, దిశ డీఎస్పీ నున్న మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ శిక్షణతో పక్కా కొలువు

- పరిశ్రమల్లో పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు
- ఉమ్మడి జిల్లాలో 37 ఐటీఐలు
- అప్రెంటిస్‌షిప్‌కు ఎంపికైతే ఖాతాలో రూ.9,550 జమ



ఏలూరులోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ



ఐటీఐలో వర్క్‌షాప్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పదో తరగతి పాసైనా, ఫెయిలైనా, ఇంటర్ పాసైనా, ఫెయిలైనా ఐటీఐల్లో చేరి వివిధ కోర్సుల్లో నైపుణ్యం సాధించవచ్చని మీకు తెలుసా? ఆ నైపుణ్యంతో చిన్న వయసులోనే పరిశ్రమల్లో మంచి ఉద్యోగాలు సాధించవచ్చని విద్యారంగ నిపుణులు చెబుతున్నారు. పారిశ్రామిక శిక్షణ కోర్సుల్లో ఏడాది, రెండేళ్ల కోర్సులు అందుబాటులో ఉన్నాయి. పదో తరగతి ఫెయిలైనా ఆయా కోర్సుల్లో చేరి మంచి నైపుణ్యం సాధించవచ్చు.

అందుబాటులో వివిధ కోర్సులు

ఐటీఐ కళాశాలల్లో పరిశ్రమలకు అవసరమైన వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తారు. వాటిలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌స్‌మెన్ సివిల్, మోటార్ వెహికల్ మెకానిక్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, మెషినిస్ట్, టర్నర్, రిఫ్రిజిరేటర్, ఎయిర్ కండీషనింగ్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, వెల్డర్, కోపా వంటి కోర్సులకు పరిశ్రమల్లో ప్రాధాన్యత లభిస్తుంది. ఆయా కోర్సులు పూర్తి చేసి వాటిలో ప్రావీణ్యం కనబరిస్తే యువతకు వెంటనే ఉద్యోగాలు లభించే అవకాశం ఉంటుంది. రెండేళ్ల కాలపరిమితితో ఎలక్ట్రీషియన్ కోర్సు పూర్తి చేస్తే గ్రామ సచివాలయం, ట్రాన్స్‌కో, జెన్‌కో, ఈపీడీసీఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలు సాధించవచ్చు. భీమవరం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ ట్రేడ్‌ను అందుబాటులో ఉంచారు.

ఫిట్టర్ కోర్సుకు డిమాండ్

ఐటీఐలో ఫిట్టర్ కోర్సు నిత్యనూతనంగా ఉంటుంది. ఈ కోర్సుకు విద్యార్థుల్లో మంచి డిమాండ్ ఉంది. ఐటీఐ కళాశాలల్లో తొలుత సీట్లన్నీ భర్తీ అయ్యేది ఈ కోర్సులోనే. రెండేళ్ల కోర్సు పూర్తి చేస్తే అటు ప్రైవేట్ పరిశ్రమలతో పాటు ప్రభుత్వ రంగ సంస్థల్లో కూడా మంచి ఉద్యోగాలు వస్తాయి. డ్రాఫ్ట్‌స్‌మెన్ సివిల్ కోర్సు రెండేళ్లు ఉంటుంది. నిర్మాణ రంగంలో ఈ కోర్సు చేసిన వారికి అవకాశాలు ఎక్కువ. గ్రామ, వార్డు సచివాలయల్లో భర్తీ చేసే సర్వేయర్ పోస్టులకు ఈ కోర్సు చేసిన వారు అర్హత పొందుతారు. మోటార్ వెహికల్ మెకానిక్ కోర్సు రెండేళ్లు. ఇందులో ఉత్తీర్ణత సాధిస్తే రైల్వే, ఆర్టీసీలతో పాటు వివిధ మోటార్ సైకిల్, కార్ల తయారీ సంస్థల్లో ఉద్యోగావకాశాలతో పాటు సొంతంగా మోటారు వాహనాల సర్వీస్ సెంటర్లు, ఓలా క్యాబ్ వంటి వాటిలో స్వయం ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయి. ఎలక్ట్రానిక్స్, మెకానిక్ కోర్సు చేసిన వారికి టీవీలు, వాషింగ్ మెషీన్లు, ఏసీలు వంటి ఉత్పత్తి సంస్థల్లో ఉద్యోగాలు పొందవచ్చు.

అప్రెంటిస్‌షిప్‌కు ఎంపికైతే రూ.9,550 జమ

ఐటీఐ పూర్తి చేసి అప్రెంటిస్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అతని ఖాతాకు రూ.9,550 జమ చేస్తాయి. వాటిలో రాష్ట్ర ప్రభుత్వం రూ.8,050, కేంద్ర ప్రభుత్వం రూ.1,500 జమ చేస్తాయి. ఐటీఐ ఉత్తీర్ణులైన వారు ఉన్నత చదువులకు వెళ్లాలన్నా డిప్లొమా అర్హత పొందేందుకు బ్రిడ్జి కోర్సు అందుబాటులో ఉంటుంది. బ్రిడ్జి కోర్సు పూర్తి చేసిన విద్యార్థి నేరుగా డిప్లమో 2వ సంవత్సరం చదవడానికి అర్హత పొందుతాడు. వీటితో పాటు కోపా కోర్సు కేవలం 10వ తరగతి విద్యార్హతతో చేయవచ్చు. ఈ కోర్సు చేసిన వారికి కంప్యూటర్ ఆపరేటర్లుగా, హార్డ్‌వేర్ రంగంలో ఉద్యోగావకాశాలు ఎక్కువగానే లభిస్తున్నాయి. 8వ తరగతి ఉత్తీర్ణులైన వారు ఏడాది మాత్రమే చదివే వెల్డర్ కోర్సులో చేరవచ్చు. ఇందులో ఉత్తీర్ణులైన వారికి రైల్వేలతో పాటు ఓఎన్‌జీసీ, ఆర్టీసీల్లో, పరిశ్రమల్లో ఉద్యోగాలు లభిస్తాయి.

ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 37 ఐటీఐలు

ఐటీఐలో చేరి వివిధ కోర్సులు చేయాలనుకునే విద్యార్థులకు ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మొత్తం 37 కళాశాలలు అందుబాటులో ఉన్నాయి. వాటిలో ఏలూరు జిల్లాలో ప్రభుత్వ ఐటీఐలు 5 ఉండగా వివిధ ట్రేడుల్లో 876 సీట్లు, 14 ప్రైవేట్ ఐటీఐలు ఉండగా వాటిలో 1,672 సీట్లు అందుబాటులో ఉన్నాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో 2 ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో 308 సీట్లు, 16 ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో 2,736 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

సర్వీస్ టెక్నీషియన్‌గా రూ.20 వేల జీతం



2020-22 మధ్య ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లో శిక్షణ పొందాను. శిక్షణ కాలంలో అనేక అంశాల్లో నైపుణ్యం పెంచుకోగలిగాను. ప్రస్తుతం హైదరాబాద్‌లోని మేధా సర్వోడ్రైవ్స్ సంస్థలో సర్వీస్ టెక్నీషియన్‌గా ఉద్యోగం లభించింది. రూ. 20 వేలు జీతం వస్తోంది.

– ఎస్‌వీఎస్‌పీ రవి కుమార్, ఐటీఐ విద్యార్థి

మధ్యప్రదేశ్‌లో ఉద్యోగం



నేను ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లో శిక్షణ పొందాను. వివిధ అంశాల్లో పట్టు సంపాదించాను. ప్రస్తుతం మధ్యప్రదేశ్‌కు చెందిన మెగా ఇంజనీరింగ్ సంస్థలో సర్వీస్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాను. రూ. 20 వేలు సంపాదిస్తున్నాను.

– ఆర్.సాయిబాబా, ఐటీఐ విద్యార్థి

జూన్ 10 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చు



ఐటీఐ కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకు ప్రభుత్వం జూన్ 10 వరకూ గడువు ఇచ్చింది. కోర్సుల్లో ప్రవేశించిన వారికి శిక్షణ కాలంలో ప్రభుత్వం నుంచి అన్ని రాయితీలు అందుతాయి.

– పీ రజిత, ఏలూరు పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రధానాధికారి

క్లుప్తంగా

పల్లాలమ్మకు బంగారు నెక్లెస్ సమర్పణ



అమ్మవారికి బంగారు నెక్లెస్ సమర్పిస్తున్న దాతలు

కాళ్ల: పెద అమిరం గ్రామంలో గ్రామ దేవత పల్లాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారికి దాతలు బంగారు నెక్లెస్ సమర్పించారు. గ్రామ పెద్దలు ముదుండి వెంకట సత్యనారాయణ రాజు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు ఉషాకుమారి కుమారులు సోమరాజు రూ.3 లక్షల విలువ చేసే ఐదు కాసుల బంగారు నెక్లెస్ ఆలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు, ఆలయ నిర్వాహకులు దాతలను అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వేగేశ్న జయరామకృష్ణంరాజు, కోరా రామ్మూర్తి, నడింపల్లి సుబ్బరాజు, జవ్వాది కిషోర్, గొట్టుముక్కల రామకృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు ప్రజలు సహకరించాలి

ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్



పెనుగొండ: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని, భీమవరంలో జూన్ 4వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ప్రజలు సహకరించాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్ అన్నారు. మంగళవారం ఆయన ఆచంట, పెనుగొండ పోలీసుస్టేషన్లను తనిఖీ చేశారు. అనంతరం పెనుగొండలో ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ప్రవర్తన నియమావళి వచ్చే నెల 8వ తేదీ వరకు అమలులో ఉంటుందన్నారు. ప్రజలు గుంపులుగా ఉండటం, గ్రామాల నుంచి ప్రజలను తరలించటం, సమావేశాల నిర్వహణ తదితర కార్యక్రమాలు చేయరాదని, ప్రజలు ఇంటి వద్ద నుంచి టీవీల్లో ఎన్నికల ఫలితాలను వీక్షించాలన్నారు. గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పూర్తి స్థాయిలో పోలీసు సిబ్బంది భద్రత చర్యలు చేపట్టారన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ అందరి బాధ్యత అని వివరించారు. భీమవరంలో జరిగే కౌంటింగ్‌లో పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్లు అనుమతి ఉన్న వారే హాజరుకావాలన్నారు. ఎన్నికల నిబంధనలను ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నరసాపురం డీఎస్పీ టి.శ్రీనివాసరావు, అడిషనల్ ఎస్పీ వి.భీమారావు; భీమవరం స్పెషల్ బ్రాంచ్ సీఐ తిలక్, సీఐ ఎన్.రజనీకుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు గృహ'మస్తు'

- పశ్చిమలో 27 వేల మందికి నెరవేరిన సొంతింటి కల
- నిర్మాణ దశలో మరో 44,298 మంది లబ్ధిదారుల ఇళ్లు
- జిల్లాలో 892.50 ఎకరాల భూమి పేదలకు పంపిణీ
- రూ.1,034 కోట్ల ఖర్చుతో జగనన్న కాలనీల్లో వసతులు



తణుకు మండలం దువ్వలో జగనన్న లేఅవుట్‌లో నిర్మించిన గృహాలు

జిల్లాలో జగనన్న ఇళ్ల నిర్మాణాల వివరాలు	
సేకరించిన భూమి	892.50 ఎకరాలు
మొత్తం లేఅవుట్లు	630
లేఅవుట్‌లలో మంజూరైన ఇళ్లు	49,817
సొంత స్థలంలో మంజూరైన ఇళ్లు	21,481
మొత్తం పూర్తయిన ఇళ్లు	27 వేలు
వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నవి	44,298



కావలిపురంలో జగనన్న లేఅవుట్‌లో ఇళ్లు

భీమవరం (ప్రకాశం చౌక్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదల సొంతింటి కల సాకారమైంది. పేదవాడి సొంతింటి కల నేర్చాలని వేలాది ఎకరాల భూములను సేకరించి పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాక ఇల్లు కట్టుకోడానికి వైఎస్ జగన్ ప్రభుత్వం ఆర్థిక సాయం అందించింది. లక్షల విలువ చేసే ఇంటి స్థలాలను పార్టీలు, కులాలు, మతాలు, వర్గాలకు అతీతంగా అందించి ఇళ్ల నిర్మాణం చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఇంతవరకు 27 వేల మంది పేదలు సొంత ఇళ్లు నిర్మించుకున్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న వారిలో 90 శాతం మంది లబ్ధిదారులు గృహప్రవేశాలు చేసుకున్నారు.

మూడేళ్లలో 27 వేల ఇళ్లు పూర్తి..
వివిధ దశల్లో 44,298 ఇళ్లు

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదవాడి సొంతింటి కలను నేరవేర్చాలని లక్ష్యంతో భూసేకరణను వేగవంతం చేశారు. అందులో భాగంగా జిల్లాలో 892.50 ఎకరాల భూములను సేకరించి వాటిని మెరక చేసి ఇళ్ల స్థలాల లేవుట్‌లు చేసి జిల్లాకు 71,283 ఇళ్లు మంజూరు చేశారు. అనంతరం రెండేళ్ల పాటు కరోనా మహమ్మారి విజృంభించడంతో ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టడానికి వీలు లేని పరిస్థితి ఏర్పడింది. కరోనా ముప్పు తొలగడంతో లాక్‌డౌన్ ఎత్తివేయడంతో ప్రభుత్వం అందించిన ఒక్కో లబ్ధిదారుడికి రూ.1.80 లక్షల చొప్పున ఇచ్చిన ఆర్థిక సాయంతో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక, మెటీరియల్ సకాలంలో అందించడంతో లబ్ధిదారులు సొంతింటి నిర్మాణం పూర్తి చేసుకున్నారు. కొన్ని ఇళ్లు కాంట్రాక్టర్లు నిర్మిస్తే, కొన్నింటిని లబ్ధిదారులే నిర్మించుకున్నారు. దీంతో గడిచిన మూడేళ్లలో జిల్లాలో 27 వేల మంది ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకుని గృహ ప్రవేశాలు చేశారు. అలాగే మరో 44,298 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. జిల్లాలోని జగనన్న లేఅవుట్‌లలో వివిధ అవసరాల కోసం ప్రభుత్వం మొత్తం రూ.1,034 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో భూసేకరణకు రూ.433.33 కోట్లు, ఇళ్ల నిర్మాణం కోసం రూ.584.70 కోట్లు, మౌలిక వసతులకు రూ.22.04 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది.

తొలిగిన అద్దె బాధలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు సొంత గృహాలను నిర్మించడంతో అప్పటివరకు అద్దె ఇంటిల్లో ఉండేవారు సొంతింటికి చేరారు. దీంతో ఏళ్ల తరబడి అద్దెలు కట్టి కట్టి ఇబ్బందులు పడినవారికి సొంత ఇళ్లల్లోకి మారడంతో అద్దె బాధలు తొలిగాయి. పేద, మధ్యతరగతి కుటుంబాలకు అద్దె అనేది చాలా భారంగా ఉంటుందని భావించిన సీఎం వైఎస్ జగన్ వారికి సొంతిల్లు వేగంగా నిర్మించి ఇచ్చి వారి అద్దె నుంచి విముక్తి కలిగించారు.

విత్తనశుద్ధి కర్మాగారంలో విజిలెన్స్ తనిఖీలు

- బిల్లులు లేని రూ.4.75 లక్షల విలువైన 61 క్వింటాళ్ల విత్తనాలు స్వాధీనం
- యజమాని చిట్టూరి సూర్యనారాయణపై కేసు నమోదు



విత్తనశుద్ధి కర్మాగారంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

పెంటపాడు: రాచెర్ల గ్రామంలో ధన సీడ్స్ విత్తనశుద్ధి కర్మాగారంలో మంగళవారం విజిలెన్సు అధికారులు తనిఖీలు చేశారు. సరైన బిల్లులు లేకుండా విత్తనాలు నిల్వ చేసినట్లుగా వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు ఏలూరు రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కరణం కుమార్ ఆదేశాల మేరకు కర్మాగారంలో తనిఖీలు నిర్వహించి సరైన బిల్లులు లేని రూ.4,75,650 విలువైన 61 క్వింటాళ్ల తెల్ల హంస, పీఆర్ 126 అనే రెండు రకాల విత్తనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. యజమాని చిట్టూరి సూర్యనారాయణపై 6ఎ సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేశారు. ఈ తనిఖీలో విజిలెన్సు ఇన్‌స్పెక్టర్ పి.శివరామకృష్ణ, విజిలెన్స్ వ్యవసాయ శాఖాధికారి పి.సురేష్, మండల వ్యవసాయ శాఖ అధికారి పార్థసారథి పాల్గొన్నారు.

రావిపాడులో ఉద్రిక్తత

- జవాన్ స్థలంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసిన దళితులు
- దళితులకు, జవాన్ కుటుంబీకుల మధ్య ఘర్షణ
- ఆందోళనకారులతో అధికారుల చర్చలు.. ఎట్టకేలకు విగ్రహం తొలగింపు
- పోలీసులపై రాళ్లదాడి.. సీఐ, ఎస్సై, కానిస్టేబుళ్లకు గాయాలు



రావిపాడులో బాధితుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

పెంటపాడు: రావిపాడులో ఓ సైనికోద్యోగికి ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో కొందరు దళితులు అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడంతో మంగళవారం ఉద్రిక్త పరిస్థితులకు దారి తీసింది. దీంతో ఉదయం నుంచి రాత్రి వరకు హైడ్రామా నడిచి ఎట్టకేలకు జవాన్ భూమిలో అక్రమంగా పెట్టిన అంబేడ్కర్ విగ్రహాన్ని అధికారుల సమక్షంలో చర్చల అనంతరం తొలగించారు. ఈ నేపథ్యంలో కొంతమంది దళితులు పోలీసులు, అధికారులపై రాళ్లు రువ్వడంతో ఇద్దరు పోలీసులకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. రావిపాడు గ్రామానికి చెందిన సైనిక ఉద్యోగి పలివెల నాగేశ్వరరావు ప్రభుత్వానికి చేసుకున్న ఆర్జీ మేరకు కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామంలో 3 సెంట్ల భూమిని ప్రభుత్వం కేటాయించింది. ఆ భూమిలో జవాను కుటుంబం ఇల్లు నిర్మించుకొంటుండగా మంగళవారం కొంతమంది దళితులు, దళిత సంఘాల నాయకులు ఆ స్థలంలో అంబేడ్కర్ విగ్రహాన్ని పెట్టి వివాదానికి తెరలేపారు. దీంతో జవాన్ కుటుంబసభ్యులకు, దళితులకు మధ్య వివాదం జరిగి ఘర్షణకు దారి తీసింది. కొందరు దళితులు జవాన్ భార్యపై దాడి చేయడంతో ఆమెకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఆర్డీవో చెన్నయ్య, డీఎస్పీ మూర్తి, తహసీల్దార్ రమేష్ బాబు, సీఐ రమేష్, ఎస్సై శంకర్ గ్రామంలో ఇరువర్గాలతో చర్చించారు. రాత్రి అయినా వివాదం కొలిక్కిరాలేదు. మరోసారి అధికారులు దళిత నాయకులతో చర్చల అనంతరం పోలీసులు విగ్రహాన్ని ఎట్టకేలకు తరలించారు. చర్చలలో సర్పంచ్ పెన్నాడ సూరిబాబు, సొసైటీ మాజీ చైర్మన్ దేవ వెంకటరమణ, మాలమహానాడు జాతీయ అధ్యక్షులు చీకటిమిల్లి మంగరాజు, ఉపసర్పంచ్ దాకే బుల్లబ్బాయి. ఎస్సీ నాయకులు డెక్కపాటి వెంకటరమణ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, అంబేడ్కర్ విగ్రహాన్ని పోలీసులు తొలగించారన్న అక్కసుతో గ్రామంలో దళితులలో కొందరు పోలీసులు, అధికారులపై రాళ్లదాడికి దిగారు. ఈ ఘటనలో తాడేపల్లిగూడెం రూరల్ సీఐ రమేష్ చేతికి, తాడేపల్లిగూడెం టౌన్ ఎస్సై సుధాకరరెడ్డి, తణుకు ట్రాఫిక్ కానిస్టేబుల్, రెవెన్యూ శాఖకు చెందిన ఉద్యోగికి గాయాలయ్యాయి. వారిని హుటాహుటిన వైద్యం నిమిత్తం గూడెం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో గ్రామంలో పోలీసులు 144 సెక్షన్ విధించారు. ఆర్డీవో చెన్నయ్య, డీఎస్పీ మూర్తి, తహసీల్దార్ సురేష్‌బాబు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

అవకాశాలను మెరుగుపరుచుకోవాలి

తాడేపల్లిగూడెం: విద్యార్థి దశలో నేర్చుకున్న విజ్ఞానంతో భవిష్యత్‌లో ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకోవాలని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ ఉపకులపతి టి.జానకిరామ్ కోరారు. వెంకట్రామన్నగూడెంలోని కేవీకేలో గ్రామీణ కృషి విజ్ఞాన అవగాహన, రైతు సదస్సు జరిగింది. శిక్షణకు అవసరమైన ఎల్‌ఈడీ డిస్‌ప్లే యూనిట్‌ను ప్రారంభించారు. డ్రోన్ టెక్నాలజీ, సేంద్రియ వ్యవసాయం, మొబైల్స్ అప్లికేషన్స్‌పై విద్యార్థులు నాటికను ప్రదర్శించారు.

దానియేలు సేవలు మరువలేనివి

- రాష్ట్ర శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు
- దిరుసుమర్రులో దానియేలు విగ్రహావిష్కరణ



దిరుసుమర్రులో గూడపాటి దానియేలు విగ్రహాన్ని ఆవిష్కరించిన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

భీమవరం అర్బన్: దిరుసుమర్రు గ్రామాభివృద్ధికి సర్పంచ్‌గా గూడపాటి దానియేలు ఎంతగానో కృషి చేశారని, అటువంటి వ్యక్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. భీమవరం మండలంలోని దిరుసుమర్రు గ్రామంలో రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షులు మేడిది జాన్సన్, నరసాపురం పార్లమెంట్ అభ్యర్థిని గూడూరి ఉమాబాలతో కలిసి రాష్ట్ర శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు మంగళవారం గ్రామ మాజీ సర్పంచ్ గూడపాటి దానియేలు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొయ్యే మోషేన్‌రాజు మాట్లాడుతూ మనం చేసిన మంచి పనులే ప్రజలకు గుర్తుండిపోయేలా చేస్తాయన్నారు. మాజీ సర్పంచ్ గూడపాటి దానియేలు తన రాజకీయ చతురతతో ఎంతోమంది సమస్యలు పరిష్కరించేవారన్నారు. ఆయన చేసిన సేవలను వక్తలు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మెంటే పార్థసారథి, ఐజాక్ బాబు, మాజీ సర్పంచ్ బోకూరి విజయరాజు, దానియేలు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కారు ఢీకొని తాపీ కూలీ దుర్మరణం

పెనుమంట్ర: కానూరు–లంకలకోడేరు వంతెన వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ తాపీ కూలీ అక్కడికక్కడే మృతి చెందగా, తాపీ మేస్త్రికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. నెలమూరు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ నాగరాజు రామరాజు (63) తన సొంత ఇంటి నిర్మాణం కోసం సామగ్రి తెచ్చుకునేందుకు తాపీమేస్త్రి షేక్ సత్తార్‌తో కలిసి మంగళవారం మోటారు సైకిల్‌పై కొమ్ముచిక్కాల బయలుదేరారు. కానూరు– లంకలకోడేరు వంతెన వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న కారు వీరి మోటార్‌సైకిల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో రామరాజుకు తీవ్రగాయాలై ఘటనా స్థలంలోనే మృతి చెందగా, సత్తార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సత్తార్‌ను 108 వాహనంలో చికిత్స నిమిత్తం పాలకొల్లు ఆసుపత్రికి తీసుకెళ్లారు. రామరాజు మృతదేహాన్ని తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రవీంద్రబాబు చెప్పారు.

మద్దతు ధరకు రొయ్యల కొనుగోలుకు వినతి



కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆక్వా రైతు సంఘం నాయకులు


భీమవరం: రొయ్యల ధరలు గణనీయంగా తగ్గడంతో ఆక్వా రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని, ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం జోక్యం చేసుకుని మద్దతు ధరలకు రొయ్యలు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రొయ్యల రైతుల సంఘం నాయకులు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీని కోరారు. మంగళవారం ఆక్వా రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి గాదిరాజు వెంకటసుబ్బరాజు (జీకేఎఫ్), అదనపు కార్యదర్శి మళ్ల తులసీరామ్ (రాంబాబు) కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆక్వా సాగులో గతంలో ఎన్నడూలేని విధంగా ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయని, ఇటువంటి తరుణంలో రొయ్యల కొనుగోలుదారులు ధరలు తగ్గించడం వల్ల మరింత దుర్భర పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో రొయ్యల పట్టుబడులు పెరిగాయని, దీనిని ఆసరాగా చేసుకుని కొనుగోలుదారులు కిలోకు రూ.20 వరకు ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారని వాపోయారు. ప్రభుత్వ అధికారులు, అప్సడా, ఫిషరీస్ అధికారుల దృష్టికి కూడా తమ సమస్యను తీసుకువెళ్లినట్టు సుబ్బరాజు, రాంబాబు చెప్పారు. మద్దతు ధరలకు రొయ్యలు కొనుగోలు చేయకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారన్నారు. అధికారులు స్పందించి మద్దతు ధరలకు రొయ్యలు కొనుగోలు చేసేలా కొనుగోలుదారులతో మాట్లాడాలని కోరారు. కలెక్టర్‌తోపాటు అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్, ఫిషరీస్ జేడీ ఆర్‌వీఎస్‌వీ ప్రసాద్‌కు వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. సంఘం నాయకులు వెంకటేశ్వరరాజు, ఐ.సీతారామరాజు, ఎన్.మహేష్, ఎ.పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

గత వైభవానికి ప్రతీక.. మొగల్తూరు కోట


- 1608 నుంచి 1876 వరకు ఏకఛత్రాధిపత్యంగా జల్లిగెడల గంగరాజు వంశస్తుల పాలన
- 800 చదరపు మైళ్ల విస్తీర్ణంలో 300 గ్రామాలతో విరాజిల్లిన మొగల్తూరు సంస్థానం
- ఇప్పటికీ కోట సంస్థానాధీశుల వారసులకు కొనసాగుతున్న రాచరిక మర్యాదలు



మొగల్తూరు కోటలో ఆనాటి అంతఃపురం



శ్రీరాజా కలిదిండి కుమార దైవప్రసాద లక్ష్మీనరసింహ రాజబహుద్దూర్



శ్రీరాజా కలిదిండి దేవీ కాంత లక్ష్మీకాంత రాజబహుద్దూర్

మొగల్తూరు: రాజ్యాలు పోయాయి.. సంస్థానాలు అంతరించాయి.. కోటలు శిథిలమయ్యాయి. కానీ వాటి ఆనవాళ్లు మాత్రం మిగిలి అలనాటి వైభవాలను చాటుతున్నాయి. దాదాపు రెండు శతాబ్దాల పాలనకు కేంద్రమైన మొగల్తూరు సంస్థాన వైభవంపై ఇప్పటికీ స్థానిక ప్రజలు కథలుగా చెప్పుకుంటారు. మొగల్తూరు సంస్థానాన్ని 16వ శతాబ్దం నుంచి 18వ శతాబ్దం వరకు సంస్థానాధీశులు పాలించారు. 1608 సంవత్సరంలో జల్లిగెడల గంగరాజు మొగల్తూరు సంస్థానాన్ని స్థాపించగా, 1876 సంవత్సరం వరకు వారి వంశస్తులు ఏకఛత్రాధిపత్యంగా పాలించారు. 800 చదరపు మైళ్ల విస్తీర్ణంలో 300 గ్రామాలతో మొగల్తూరు సంస్థానం విరాజిల్లింది. మొగల్తూరు, ఆచంట, దొడ్డిపట్ల, ఉండి, వీరవాసరం, శివదేవుని చిక్కాల, కొవ్వూరు పరగణాలు, తూర్పుగోదావరి జిల్లాలోని పేరూరు, కృష్ణా జిల్లాలోని కలిదిండి పరగణాలు ఈ సంస్థానం పరిధిలో ఉండేవి. మొగల్తూరు సంస్థానంగా, కేతకీపుర మహా సామ్రాజ్యంగా పేరు ప్రతిష్ఠలు పొందింది. ఈ కోట గోడలు 20 అడుగుల మందంతో, రెండు తాటిచెట్ల ఎత్తులో ఉండేవి. కోట గోడపై నుంచి రెండు ఎడ్ల బండ్లు వెళ్లేలా ఉండేదని, 2.5 హెక్టార్ల విస్తీర్ణంలో చుట్టూ గుండ్రని ఆకారంలో కోట గోడ ఉండేది. ఆకోటలోనే లక్కమేడను నిర్మించారు. సంస్థానానికి సంబంధించిన వారసులు శ్రీరాజా కలిదిండి రామరాజ బహుద్దూర్ కుటుంబ సభ్యులు, గోపాల కృష్ణ రాజబహుద్దూర్, శ్రీరాజా కలిదిండి స్వర్ణ కుమార్‌బాబులు ఇప్పటికీ ఈ కోటలోనే నివసిస్తున్నారు.

మొగల్తూరు సంస్థానాన్ని ఏలిన రాజులు వీరే..

జల్లిగెడల గంగరాజు సంస్థానాన్ని స్థాపించారు. తదనంతరం ఆయన వారసులు పెదబాపరాజు, చినబాపరాజు, పెద్దరాజు, చిన్నరాజు, సూరపురాజు, పెద గంగరాజు, చినగంగరాజు సంస్థానాన్ని పాలించారు. చివరగా తిరుపతిరాజులు అనంతరం శ్రీరాజా కలిదిండి కుమార దైవ ప్రసాద లక్ష్మీనరసింహ రాజబహుద్దూర్ (ఈయన పాలనలోనే కోటను బ్రిటీష్ వారు స్వాధీనం చేసుకున్నారు) రాచరిక పాలన సమసిపోయినా శ్రీరాజా కలిదిండి దేవీకాంత లక్ష్మీకాంత రాజబహద్దూర్, శ్రీరాజా కలిదిండి కుమార లక్ష్మీ నరసింహరాజ బహుద్దూర్ (దత్తుడు)లు చెప్పిందే వేదంగా సాగేది. ఇప్పటికీ కోట సంస్థానాధీశుల వారసులకు గౌరవ మర్యాదలు, రాచరిక మర్యాదలు కొనసాగుతూనే ఉన్నాయి.



మొగల్తూరు కోటలోని లక్కమేడ



లక్కమేడలో చెక్కుచెదరని సీలింగ్

చెక్కుచెదరని లక్కమేడ

రాజులు ప్రజలతో మాట్లాడేందుకు లక్కమేడను, అందులోనే రాజదర్బారును నిర్మించారు. ఆనాడు నిర్మించిన లక్కమేడను చైనా ఇంజినీర్లు రూపకల్పన చేశారని, కోట నిర్మాణానికి కోడిగుడ్డు తెల్లసోన కలిపిన మట్టిని వాడారని రాజవంశస్తులు తెలిపేవారు. లక్కమేడ ముఖ్యమైన రాజదర్బార్‌గా విల్లసిల్లేది. భవనం సీలింగ్‌కు లక్క పూయడం వల్ల దీనికి లక్కమేడ అనిపేరు వచ్చింది. ఇప్పటికీ ఈ భవనం గోడలపై చేయి వేస్తే జారిపోయేంత నునుపుదనంతో ఉంటాయి. గదులలో గోడలకున్న డిజైన్లు తాజ్‌మహల్ తరువాత దీనికే ఉన్నాయని రాజవంశస్తులు చెబుతుండేవారు. అవి ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉండటం ఆనాటి నైపుణ్యానికి మచ్చుతునక.



శ్రీరాజా కలిదిండి కుమార లక్ష్మీ నరసింహ రాజబహుద్దూర్

వీరితోనే రథయాత్ర ప్రారంభం

మొగల్తూరు కోట సంస్థానాధీశుల వారసులైన శ్రీరాజా కలిదిండి కుమార సింహ జగపతిరాజు, కుటుంబ సభ్యులు అంతర్వేది రథయాత్రకు కొబ్బరికాయ కొట్టి యాత్ర ప్రారంభిస్తుండటం విశేషం.

క్లుప్తంగా

సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



తణుకులో వృద్ధులకు వైద్య సేవలందిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్స్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ భవనంలో శిబిరానికి హాజరైన 28 మంది వృద్ధులకు డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్రబాబు వైద్యసేవలు అందజేశారు. ఈ సందర్భంగా బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించి రిపోర్టులు అందజేశారు. వైద్యసలహాల అనంతరం పేద వృద్ధులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, సజ్జాపురం అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఈదర ప్రసాదరావు, కోసూరి గాంధీ, సభ్యులు ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాధు, వృద్ధులు పాల్గొన్నారు.

అపారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో డ్రెయినేజీల ఆక్రమణ వలన పలు ప్రాంతాలు కొద్దిపాటి వర్షానికే నీట మునిగిపోతున్నాయని మునిసిపల్ కమిషనర్ విజయసారథి అన్నారు. మంగళవారం డ్రెయినేజీల్లో సిల్ట్ తీసే కార్యక్రమం మొదలుపెట్టారు. కమిషనర్ విజయసారథి మాట్లాడుతూ చిన్నపాటి వర్షానికే బస్టాండ్ సెంటర్లో నీరు నిల్వ ఉండిపోతుందని, అపారిశుధ్యం తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముందుగా బస్టాండ్ వెనుక ఉన్న డ్రెయినేజీలో సిల్ట్ తీయిస్తున్నామని తద్వారా మురుగునీరు పారుదల వేగంగా ఉంటుందన్నారు. పట్టణ ప్రజలకు పారిశుధ్యం ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ప్రధాన మురుగు బోదుల్లో ప్రక్షాళన చేపట్టామన్నారు.

వైఎస్సార్ సీపీ విజయం ఖాయం

యలమంచిలి: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్లుగా నవరత్నాల పేరిట అమలు చేసిన సంక్షేమ పథకాలే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకువస్తున్నాయని ఆ పార్టీ పాలకొల్లు నియోజకవర్గ జేసీఎస్ బూత్ ఇన్‌చార్జి ఉచ్చుల స్టాలిన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దళిత, బడుగు, బలహీన, మైనారిటీ వర్గాల ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంట ఉన్నారని, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చూడాలని ఉవ్విళ్లూరుతున్నారన్నారు. కూటమి అధికారంలోకి వస్తుందనే భ్రమలో ఆ నాయకులున్నారని, వారి భ్రమలన్నీ జూన్ 4న పటాపంచలు అవుతాయన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో అల్లర్లు జరగకుండా ఎన్నికల కమిషన్ కఠిన ఆంక్షలు విధించాలని స్టాలిన్ కోరారు. జూన్ 9న విశాఖపట్నంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండవసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమన్నారు.

నేడు చాంబర్స్ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక చాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి సినర్జిన్‌లాబ్స్ కంపెనీ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఏదైనా డిగ్రీ (కెమిస్ట్రీ), పీజీ (కెమిస్ట్రీ), బీటెక్, బీఈ ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. వివరాలకు సెల్ నంబర్‌లో 97013 94660లో సంప్రదించాలన్నారు.

250 మందికి ఆహార పొట్లాల పంపిణీ

భీమవరం (ప్రకాశంచౌక్): పేదల ఆకలిని తీర్చేందుకు హంగర్ ఫ్రీ వరల్డ్ అంటూ మలబార్ గోల్డ్ చేస్తున్న సేవలు అద్వితీయమని ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ చైర్మన్ ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు, సూర్యమిత్ర ఎగ్జిమ్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ యిర్రింకి సూర్యారావు అన్నారు. వరల్డ్ హంగర్ డే సందర్భంగా ఆకలి-రహిత ప్రపంచం సాధన దిశగా మలబార్ గోల్డ్ హంగర్ ఫ్రీ వరల్డ్ ప్రోగ్రామ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా భీమవరంలో 250 మందికి ఉచిత ఆహార పొట్లాలను అందజేశారు. భీమవరం షోరూం హెడ్ ఇంథియాస్ మాట్లాడుతూ 16 రాష్ట్రాల్లోని 70 నగరాల్లో మలబార్ గోల్డ్ ఈ కార్యక్రమాన్ని చేపడుతోందని తెలిపారు. అనంతరం ఇందిరమ్మ కాలనీ పలు ఆశ్రమంలోని వృద్ధులకు ఆహార ప్యాకెట్లను అందజేశారు.కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి, దాయన చంద్రజి, అల్లు శ్రీనివాస్, నరసింహ, కృష్ణ, షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

3 నుంచి సువార్త సభలు

ఉండి: ఉండి శివారు ఉప్పుగుంట సెయింట్ పాల్స్ లూథరన్ చర్చ్ ఆధ్వర్యంలో జూన్ నెల 3వ నుంచి 5వ తేదీ బుధవారం వరకు రక్షణ సువార్త సభలు నిర్వహిస్తున్నట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు.ఉదయం సభ 10 గంటలకు, సాయంత్రం సభ 6 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేరిషపాస్టర్ రెవరెండ్ బీ డేవిగ్‌లివింగ్‌స్టన్ ఈ సభలను ప్రారంభిస్తారని రెవరెండ్ యం జోసఫ్ (చేబ్రోలు),పాస్టర్ కే జార్జ్‌బుష్(మచిలీపట్నం),బ్రదర్ కే జాన్‌మంగాచార్యులు (పెదలంక),బ్రదర్,ఎన్ ఎనోష్‌రాజు(విశాఖపట్నం)నుంచి వాక్యోపదేశం చేసేందుకు వస్తున్నట్లు తెలిపారు.

ఐదేళ్లుగా అన్నదాతకు ఆర్థిక సాయం

- రైతు భరోసా సాయం రూ.16వేలు పెంచుతూ నిర్ణయం
- రైతు భరోసా కేంద్రాలతో ఉన్న ఊరిలోనే విత్తనాలు, ఎరువులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



ఇరగవరంలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

ఇరగవరం: ప్రజాసంకల్పయాత్రలో రైతుల కష్టాలు తెలుసుకున్న జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో అన్నదాతల కోసం వ్యవసాయంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారు. అరుగాలం శ్రమించే రైతులు సాగు సమయంలో విత్తనాలు, ఎరువులు, కొనుగోలుకు ఇతర మదుపుల కోసం ఎలాంటి అప్పులు చేయకుండా ఉండాలనే రైతు భరోసా పథకానికి శ్రీకారం చుట్టి ఒక్కో రైతుకు ఏటా రూ.13,500 చొప్పున ఐదేళ్ల పాటు అందజేశారు. 2019కి ముందు రైతులు విత్తనాలు, ఎరువుల కోసం మండల కేంద్రాలకు తిరుగుతూ క్యూలైన్లలో గంటల సమయం, నిలబడి, పోలీసులు లాఠీల దెబ్బలు తినాల్సిన దుస్థితి ఉండేది. రైతులు అలాంటి ఇబ్బందులు పడకూడదనే ప్రతి గ్రామ సచివాలయ ఆవరణలోనే రైతు భరోసా కేంద్రాలను నిర్మించి ఉన్న ఊరిలోనే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు లభించే విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారు. దీంతో అన్న దాతలు రైతుభరోసా కేంద్రానికి వెళితే చాలు వారికి కావాల్సిన విత్తనాలు, ఎరువులు లభిస్తున్నాయి. రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం మద్దతు ధరకు ధాన్యం కొనుగోళ్లు చేపడుతుండడంతో రైతులకు దళారులు బెడద తప్పింది. ప్రతి సీజన్‌లోనూ సాగుచేసే పంటల వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేయించి, పంటలకు నష్టం వాటిల్లితే సకాలంలో ప్రభుత్వం బీమా చెల్లించి ఆదుకుంది. 2009నుంచి 2024 వరకు రైతు కోసం అమలు చేస్తున్న రైతుభరోసా పథకాన్ని రాబోయే రోజుల్లో సాగు సాగిస్తూ ఇప్పుడున్న సాయం రూ.13,500 నుంచి 16వేలకు పెంచుతున్నట్లు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలో ప్రకటించారు. రైతుల కోసం ఈ ఐదేళ్లలో అమలు చేసిన ప్రతీ పథకం కొనసాగుతుందని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రకటనపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు అండగా సీఎం..

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు ఎంతో అండగా నిలిచారు. గతంలో రైతులకు ఇన్ని సదుపాయాలు లేవు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక రైతుభరోసా పథకం ద్వారా ఏటా రూ.13,500 చొప్పున నాఖాతాలో జమచేశారు. ఎక్కడకకూ వెళ్లాల్సిన పనిలేకుండా మాఊరిలోనే రైతు భరోసా కేంద్రం ద్వారా విత్తనాలు, ఎరువులు సరఫరా చేశారు. పంటను కూడా రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయితే రైతు భరోసా కింద రూ.16వేలు ఇస్తానని చెప్పడం చాలా సంతోషంగా ఉంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసేది మాత్రమే చెప్తాడనే నమ్మకం మాకు ఉంది.

సీఎం జగన్ రైతు పక్షపాతి



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతుల పక్షపాతి అని మరొకమారు రుజువు చేసుకున్నారు. ఇదివరకు రైతులకు ఏడాదికి పెట్టుబడి సాయం వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద రూ.13,500 ఇది వరకు అందజేశారు. ఈ మొత్తాన్ని రూ.16వేలకు పెంచడం ఆనందంగా ఉంది. అలాగే రైతులకు సున్నా వడ్డీ పంట రుణాలు, ఉచిత పంటల బీమ కూడా కొనసాగుతాయని ప్రకటించారు. 2019లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారు.

– మంగెన రామానాయుడు రైతు, ఇరగవరం ఎపీటీసీ

ఆయన మాట ఇస్తే చేస్తారు



గతంలో సాగు సమయంలో అప్పులు చేసి మదుపులు పెట్టాల్సి వచ్చేది. కానీ జగనన్న సీఎం అయ్యాక పెట్టుబడి కోసం చేసే అప్పుల బారం తగ్గింది. రైతు భరోసా పథకం ద్వారా ఏటా రూ.13,500 తమ ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. ఆ డబ్బులతో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసుకున్నాం. గతంలో మాదిరిగా మండల కేంద్రాలకు వెళ్లాల్సిన పని లేకుండా ఊరిలోనే రైతు భరోసా కేంద్రాల వద్ద విత్తనాలు, ఎరువులు అందజేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే రైతులకు చాలా మేలు జరిగింది. తాజాగా మేనిఫెస్టోలో రైతు భరోసా రూ.16వేలకు పెంచుతానని జగనన్న హామీ ఇవ్వడం సంతోషంగా ఉంది.

– పులుపు అనిల్ రేలంగి రైతు, వైఎస్సార్ సీపీ నాయకుడు

పదోతరగతి సప్లిమెంటరీ లెక్కల పరీక్ష ప్రశాంతం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి మంగళవారం 4వ రోజున లెక్కల పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పట్టణంలోని ఏడు స్కూల్స్ జెడ్పీ ఉన్నత పాఠశాల, కడకట్ల మునిసిపల్ హైస్కూల్, సుబ్బారావుపేట మునిసిపల్ హైస్కూల్, కింబర్లీ, మాంటిస్సోరి, సెంట్ జోన్స్, భాష్యం స్కూల్‌లో జరిగాయి. 899 మంది విద్యార్థులకు గాను 386 మంది పరీక్షలకు హాజరయ్యారు. 513మంది పరీక్షలకు హాజరుకాలేదు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

పాలకొల్లు సెంట్రల్: కౌంటింగ్ తరువాత ఎన్నికల కోడ్ ముగిసే వరకూ విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించకూడదని ఆర్వో బీఎస్ నారాయణరెడ్డి సూచించారు. మునిసిపల్ కార్యాలయం ఆర్వో ఛాంబర్‌లో పార్టీల నాయకులతో కౌంటింగ్ అంశాలపై సూచనలు చేశారు. కౌంటింగ్ వద్ద స్టేట్ పోలీస్, స్పెషల్ బెటాలియన్, సీఏపీఎఫ్ వంటి మూడంచెల తనిఖీ ఉంటుందన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

పెనుమంట్ర: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం ముగింపు సమావేశం మార్టేరు వేణుగోపాల ఆడిటోరియంలో మండల అధ్యక్షుడు బాణాల శ్రీనివాసరావు నిర్వహించారు. శిక్షణలో యోగ, కుంగ్‌ఫూ, కరాటే, గీతా శ్లోకాలు, కూచిపూడి, సంగీతం, కోలాటాలలో 190 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. సంస్థ అధ్యక్షుడు శ్రీనివాసరావు, తాడేపల్లి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత



డీఐజీ అశోక్‌కుమార్

తణుకు: జూన్ 4న ఎన్నికల కౌటింగ్ నేపథ్యంలో ఆయా కౌటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు ఏలూరు రేంజి డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ వెల్లడించారు. ఏలూరు రేంజి పరిధిలోని ఆరు జిల్లాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టామన్నారు. మంగళవారం తణుకు పట్టణ పోలీసు స్టేషన్‌కు విచ్చేసిన ఆయన మీడియాతో మాట్లాడారు. స్ట్రాంగ్ రూముల వద్ద పారామిలటరీ దళాలతో మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కౌంటింగ్ కేంద్రాలతోపాటు జిల్లా కేంద్రాలు, ప్రధాన ప్రాంతాల్లో అల్లర్లు జరగకుండా పటిష్ట బందోబస్తు కల్పించామన్నారు. కౌంటింగ్ జరిగే ప్రాంతాల్లో పోటీ చేసిన అభ్యర్థులతో పాటు, రాజకీయ పార్టీల ఏజెంట్లు, అనుమతించిన మీడియాకు మాత్రమే ప్రవేశం ఉందన్నారు. కౌంటింగ్ జరిగే రోజున ఫలితాల కోసం ప్రజలు ఇళ్లలోనే ఉండి టీవీల ద్వారా సమాచారం తెలుసుకోవాలని రోడ్లపైకి రావద్దని విజ్ఞప్తి చేశారు. సమస్యాత్మక గ్రామాలతోపాటు రాజకీయ నాయకులు, పోటీ చేసిన అభ్యర్థుల నివాసాల వద్ద పికెట్లు ఏర్పాటుచేస్తున్నామని వెల్లడించారు. మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒక అదనపు ఎస్పీతో పాటు ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో డీఎస్పీ భద్రత ఏర్పాట్లు పర్యవేక్షించనున్నట్లు చెప్పారు. రేంజి పరిధిలో ఎన్నికలు అనంతరం సుమారు 800 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. ఆయా ప్రాంతాల్లో ఘర్షణలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగానే కార్డన్ సెర్చ్‌లు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ప్రజల్లో భరోసా కల్పించడానికే కార్డన్ సెర్చ్‌లు నిర్వహిస్తున్నామే తప్ప వారిలో భయాందోళనలు కల్పించడానికి కాదన్నారు. కార్డన్ సెర్చ్‌లో స్వాధీనం చేసుకున్న వాహనాలకు అన్ని పత్రాలు సవ్యంగా ఉంటే అదే రోజు యజమానులకు అప్పగించేలా పోలీసు అధికారులకు సూచించామని డీఐజీ అశోక్‌కుమార్ వెల్లడించారు. ఆయన వెంట జిల్లా అదనపు ఎస్పీ వి.భీమారావు, తాడేపల్లిగూడెం డీఎస్పీ డీఎస్ఆర్‌వీఎస్ఎన్ మూర్తి, ఇతర పోలీసు అధికారులు ఉన్నారు.

బాలికలు శుభ్రత పాటించాలి



వెంకట్రామన్నగూడెం గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: బాపరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన జీవితం లభిస్తుందని వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీహర్ష అన్నారు. మంగళవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం గ్రామంలో మహిళలు, యువతులు, కిషోర్ బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రతపై మాసిక మహోత్సవ వారోత్సవాల పురస్కరించుకుని ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీహర్ష మాట్లాడుతూ మహిళ ఆరోగ్యమే కుటుంబ ఆరోగ్యమన్నారు. రుతుక్రమం తరుణంలో నిషేధిత ఉత్పత్తులను మహిళలు వినియోగించడం వల్ల అనేక అనర్థాలు సంభవిస్తున్నట్టు చెప్పారు. 11 నుంచి 18 ఏళ్ల లోపు కిషోర్‌బాలికలు, 45 ఏళ్ల దాటిన మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సీహెచ్‌వో సూర్యకాంతం, హెచ్‌వీ జ్యోతి, హెచ్ఎస్ లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగాపై శిక్షణ



వేల్పూరు గ్రంథాలయంలో యోగా చేస్తున్న విద్యార్థులు



అత్తిలి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

తణుకు టౌన్: విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులలో బాగంగా తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తి కలిగించే వివిధ అంశాలను రీసోర్సు పర్సన్‌లు వివరించారు. ఈకార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో కే సత్యనారాయణ, వైఎస్ఎన్ వసంతరావు, బసవేశ్వరరావు, గ్రంథాలయ అధికారి సాయిబాబా పాల్గొన్నారు.

అత్తిలి: వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులలో భాగంగా అత్తిలి శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులతో నీతి కథలు చదివించి, జాతీయ గీతాలను పాడించారు. అనంతరం రిసోర్సుపర్సన్ కె కోమలి యోగాపై శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే యోగ శిక్షణ ఇవ్వడం ద్వారా విద్యార్థులకు ఆత్మస్థైర్యం పెంపొందిస్తుందని, అందుకు అనుగుణంగా మేధాశక్తి పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పి శ్రీనివాసరెడ్డి, వలంటీర్ వి రమేష్, గ్రంథాలయాధికారి డి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతర ఉత్సవాలు



వెంకమ్మ అమ్మవారు

యలమంచిలి: మేడపాడు గ్రామ దేవతలు కొర్లపాటి వెంకమ్మ,, కనకదుర్గమ్మ,, జువ్వాలమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయ వంశ పారంపర్య ధర్మకర్తలు, నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో 25, 26 తేదీలలో గ్రామంలో జాతర నిర్వహించారు. 27వ తేదీ రాత్రి బలిహరణ, ఊయల ఉత్సవం నిర్వహించి అమ్మవార్లను ఆలయ ప్రవేశం చేశారు. ఐదు రోజుల తీర్థ ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని సారె, చలివిడి, పానకాలతో మొక్కులు తీర్చుకున్నారు. జూన్ 2న అన్న సమారాధనతో జాతర ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు, జాతర ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

వైభవంగా కోట్లమ్మ, మారెమ్మ జాతర

పెనుగొండ: పట్టణంలోని కోట్లమ్మ మారెమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవాలను మంగళవారం అత్యంత వైభవంగా ప్రారంభించారు. పోతురాజు ఆలయం వద్ద నుంచి జాతర మహోత్సవాలు ప్రారంభించి, భక్తులు అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించారు. ఉత్సవాల్లో భాగంగా గరగ నృత్యాలు, డీజేలు, కోలాటాలు, తీన్‌మార్ వాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. మూడు రోజుల పాటు కొనసాగే ఉత్సవాలు గురువారం తీర్థంతో ముగుస్తాయి. చివరి రోజు భక్తులు అధిక సంఖ్యలో తరలిరానుండడంతో కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

పల్లాలమ్మ జాతర

నరసాపురం రూరల్: కొప్పర్రులో వేంచేసియున్న శ్రీ పల్లాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం మంగళవారం నిర్వహించారు. వివిధ ప్రాంతాలలోని ఆడపడచులు ప్రతీ ఏటా మేలో జాతరకు గ్రామానికి వచ్చి మొక్కుబడులు చెల్లించుకుంటారు. గ్రామం పాడి, పంటలు, సుఖ సంతోషాలతో ఉండాలనే సంకల్పంతో గ్రామ దేవత జాతరను ఏటా ఆనవాయితీగా నిర్వహిస్తుంటామని గ్రామస్తులు పేర్కొన్నారు. బుధవారం అన్న సమారాధన నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు.


దేశాలమ్మ జాతర మహోత్సవాలు

పాలకొల్లు సెంట్రల్: చింతలతోటలో కొలువై ఉన్న దేశాలమ్మ అమ్మవారి 52వ జాతర మహోత్సవాలు సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. జాతరలో కళాకారుల నృత్యాల నిమిత్తం ప్రధాన రహదారిలో 12 స్టేజీలను ఏర్పాటు చేశారు. జాతర మహోత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. మంగళవారం జాతర మహోత్సవాల్లో భాగంగా గరగల నృత్యాలతో ఊరేగింపు నిర్వహించారు.

ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ చూపాలి

పాలకోడేరు: మహిళలు, యువతులు తన ఆరోగ్య పరిరక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ రంగమనాయుడు తెలిపారు. మంగళవారం విస్సాకోడేరు లోని ఫోర్ నంబర్‌పేటలో గల అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలు, యువతులు, కిషోర్ బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రతపై మాసిక మహోత్సవ వారోత్సవాల ముగింపును పురస్కరించుకుని మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రంగమనాయుడు మాట్లాడుతూ మాట్లాడుతూ మహిళ ఆరోగ్యమే కుటుంబ ఆరోగ్యమన్నారు. ఎక్కువగా క్యాన్సర్ బారిన పడుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయని తెలిపారు.

రుచికరమైన భోజనాలను వండాలి



మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవోలు

అత్తిలి: ప్రభుత్వం రూపొందించిన మెనూ ప్రకారం పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం మరింత రుచికరంగా తయారు చేయాలని ఎంఈవో -2 ఎంవీఎల్‌కే ప్రసాద్ తెలిపారు. స్థానిక ఎంపీయూపీ బాలుర పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు మంగళవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. మాస్టర్ ట్రైనీ బీకే సత్యవతి, రిసోర్సుపర్సన్‌గా ఎ అప్పలరాజు వ్యవహరించారు. మండల విద్యాశాఖాధికారి ఎస్ రమేష్ మధ్యాహ్న భోజన మెనూ వీడియోలను చూపించి వంట ఎలా చేయాలో తెలిపారు. ఈ సందర్భంగా వంట ఏజెన్సీల వారికి వంటల పోటీలు నిర్వహించారు. ఈపోటీలలో ప్రథమ బహుమతి వై అనిత, ద్వితీయ బహుమతి పి వెంకటలక్ష్మి, తృతీయ బహుమతి ఎం నాగలక్ష్మి పొందారు.

కుక్కలున్నాయి.. పిక్కలు జాగ్రత్త..!

- వెంటపడి దాడి చేస్తున్న కుక్కలు
- గగ్గోలు పెడుతున్న జనం



తణుకులో గుంపులుగా సంచరిస్తున్న శునకాలు

తణుకు: అడ్డూ.. అదుపు లేకుండా సంచరిస్తున్న శునకాలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పట్టపగలే ప్రజలు చుక్కలు చూస్తున్నారు. గ్రామ సింహాలు ప్రతి వీధిలో తిరుగుతూ రచ్చ రచ్చ చేస్తున్నాయి. కుక్కలతో పాటు పిల్లులు, కోతులు, ఎలుకలు కరిచినా ర్యాబిస్ వస్తుంది. మిగిలిన వాటితో పెద్దగా సమస్య లేకపోయినా కుక్కలు మాత్రం గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడి చేస్తున్నాయి. తణుకు పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కుక్కల వల్ల ప్రజలకు, పొలాల్లోని పశువులకు రక్షణ కరువైందని పలువురు వాపోతున్నారు. శునకాల నియంత్రణకు తణుకు మునిసిపల్ అధికారులు చర్యలు తణుకులో చేపట్టినప్పటికీ పూర్తిస్థాయిలో సత్ఫలితాలు ఇవ్వకపోవడం విమర్శలకు తావిస్తోంది. గతంలో వానరాల గుంపుపై దాడి చేసిన శునకాలు ఒక కోతిని అమానుషంగా కరిచి చంపేసిన ఘటన కలచివేసింది.

హడలెత్తిపోతున్న జనం...

తణుకు పట్టణంతో పాటు నియోజకవర్గంలోని తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల్లో ఎక్కడ చూసినా కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ఆయా గ్రామాల్లో గుంపులు, గుంపులుగా శునకాలు తిరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో అయితే కోళ్లు, పశువులపైనా దాడి చేస్తున్నాయి. వీధి కుక్కలతో పాటు ఒక్కోసారి పెంపుడు కుక్కలు సైతం దాడులకు పాల్పడుతున్నాయి. ప్రజల ప్రాణాలు తోడేస్తున్న కుక్కలను నియంత్రించడంలో అటు మునిసిపల్ ఇటు పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండంతో ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కుక్కలు ఎక్కడ మీద పడి దాడి చేస్తాయోనని బయటకు వెళ్లేందుకు మహిళలు, వృద్ధులు భయపడుతున్నారు. శునకాలు గ్రామీణ ప్రాంతాల్లో లేగదూడలు, పశువులు, కోళ్లు, మేకలపైనా దాడి చేసి గాయపరుస్తున్నాయని రైతులు వాపోతున్నారు.

చర్యలేవీ..?

తణుకు పట్టణంతో పాటు నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. పట్టణంలో పెరుగుతున్న కుక్కల సంతతిని నియంత్రించడానికి గతంలో మునిసిపల్ అధికారులు బర్త్ కంట్రోల్ (కుటుంబ నియంత్రణ) విధానం అమలు చేశారు. ప్రైవేట్, స్వచ్ఛంద సంస్థ సహకారంతో తణుకు మునిసిపల్ పరిధిలో ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ విధానంలో 104 కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేశారు. ఒకవేళ కరిచినా ప్రమాదం లేకుండా వ్యాక్సినేషన్ సైతం చేశారు. సాధారణంగా వర్షాకాలం ఆరంభంలో కుక్కలకు పిచ్చిపడుతుంటుంది. ఈ క్రమంలో అవి మనుషులను కరిచిన తర్వాత సకాలంలో వ్యాక్సిన్ వేయక పోతే మనిషికి పిచ్చి పట్టి మరణిస్తాడు. వైద్య అధికారులు, పంచాయతీ అధికారులు కుక్కల బెడదను తగ్గించడంతో పాటు వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచాలని పలువురు కోరుతున్నారు.